సాక్షి
కామారెడ్డి
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



ఆన్‌లైన్ కష్టాలు
బల్దియాలలో సాంకేతిక సమస్యలతో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ముందుకు సాగక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.
- 8లో ▸



దూరంగా ఉండాలి
విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కామారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.7 /20.9

వాతావరణం
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా జెడ్పీ సీఈవో బి.చందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. దీంతో జెడ్పీ సీఈవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ అదనపు కలెక్టర్ వచ్చే వరకు జెడ్పీ సీఈవో చందర్ ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ బాధ్యతలు నిర్వహించనున్నారు.

ముగిసిన ఎస్సెస్సీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాతంగా ముగిశాయి. బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు 12,579 మంది విద్యార్థులకు గాను 12,550 మంది హాజరయ్యారు. 29 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను డీఈవో రాజు పర్యవేక్షించారు. జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో గణితం పరీక్షకు సంబంధించి చీటీపై రాసిన ప్రశ్నలు బయట వచ్చిన వ్యవహారంలో బాధ్యులపై కేసుల నమోదు ఘటన తప్ప అన్ని కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టు అవసరాలకోసం బుధవారం ఆరో విడత నీటి విడుదల ప్రారంభించారు. ప్రాజెక్టు ప్రధాన కాలువకు 1,600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 1,394 అడుగుల(6.556 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పొడిగింపు

కామారెడ్డి టౌన్: అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ గడువును ప్రభుత్వం పొడిగించింది. ఈ నెలాఖరు వరకు అవకాశం ఇస్తూ మున్సిపల్ శాఖ జీవో విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో మరో నెల పాటు 25 శాతం రాయితీ వర్తించనుంది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో వచ్చిన దరఖాస్తుల్లో 21.50 శాతం మాత్రమే ఫీజు చెల్లించారు. మండలాల వారీగా కూడా 20 శాతమే స్పందించారు. ప్రజలనుంచి అనుకున్న మేర స్పందన రాకపోవడంతో ప్రభుత్వం గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని మైనారిటీలు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.దయానంద్ ఒక ప్రకటనలో సూచించారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ, పార్శీ మతస్తులు ఈనెల 14 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 80969 73346 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

మద్నూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు మద్నూర్ సింగిల్ విండో కార్యదర్శి బాబూరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో పంటను కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు వర్క్‌షాప్

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం 'త్రో ద లెన్స్ ఆఫ్ లిటరేచర్ -ఏ విజనరీ జర్నీ ఇన్ రీడింగ్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వర్క్‌షాప్ పోస్టర్లను ఆవిష్కరించారు. సాహిత్య పఠనం, భాషా నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి వర్క్‌షాప్ ఉపయుక్తంగా ఉంటుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.



ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు

పాతాళ గంగమ్మ.. పైకి వచ్చేదెలా?

అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం మూలంగా ప్ర'జల' కష్టాలు ఏడాది కేడాది పెరుగుతూనే ఉన్నాయి. పాతాళంలోంచి నీళ్లను తోడడమే తప్ప.. భూగర్భ జలాలను వృద్ధి చేసేందుకు సరైన ప్రయత్నాలు జరగడం లేదు. దీంతో ఏటా వేసవిలో బోరుబావులు ఎత్తిపోతుండడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- జిల్లాకేంద్రంలో వెయ్యి అడుగుల లోతు వరకు బోర్ల తవ్వకాలు
- కొన్నిచోట్ల 1,500 అడుగుల లోతు వరకు తవ్వినా ఫలితం శూన్యం
- రోజురోజుకు పడిపోతున్న భూగర్భ జలాలు
- ఇంకుడు గుంతలపై దృష్టి సారించని సర్కారు, ప్రజలు
- ఫలితంగా ఏటా వేసవిలో తప్పని నీటి కష్టాలు



ఇంకుడు గుంతలు లేని కాలనీ

కామారెడ్డి పట్టణం వ్యాపార, వాణిజ్య కేంద్రంగా పేరుగడించింది. విద్య, వైద్య రంగంలోనూ ముందుకు వెళుతోంది. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇరుగు పొరుగు జిల్లాల నుంచి కూడా చాలా మంది కామారెడ్డి పట్టణానికి వచ్చి స్థిరపడ్డారు. దీంతో పట్టణం నలువైపులా విస్తరించింది. మున్సిపాలిటీ పరిధిలో 30 వేల ఇళ్లు ఉన్నాయి. అద్దెకు ఉన్న కుటుంబాలతో కలిపి పట్టణ జనాభా లక్షా ఇరవై వేలకు చేరింది. కాగా కామారెడ్డి పట్టణంలో ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టాలంటే ముందు బోరు తవ్వాల్సిందే. పట్టణంలోని అశోక్‌నగర్, శ్రీనివాస్‌నగర్, స్నేహపురికాలనీ, శ్రీరాంనగర్, విద్యానగర్, కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీ, వివేకానంద కాలనీ తదితర ప్రాంతాల్లో వెయ్యి అడుగుల నుంచి 1,500 అడుగుల దాకా బోర్లు తవ్వుతున్నారు. కొత్తగా ఇల్లు కట్టేవారు వెయ్యి ఫీట్లు తవ్వితే ఇరుగు పొరుగు ఇళ్లలో అప్పటికే తక్కువ లోతు తవ్విన బోర్లు ఎత్తిపోతున్నాయి. వర్షాకాలం ఎలాగోలా గడిచిపోతున్నా వేసవి సీజన్ ప్రారంభం కాగానే బోర్లు ఎతిపోయి నీటి కష్టాలు మొదలవుతున్నాయి.

ఇంటికో ఇంకుడు గుంత ఉండాలి



సాధారణంగా నీరు ఉన్నప్పుడు ఎవరూ నీటి విలువను గుర్తించడం లేదు. సమస్య తలెత్తినప్పుడే దాని గురించి ఆలోచిస్తున్నారు. పట్టణమైనా, పల్లెల్లోనైనా నీటి వృథాను అరికట్టాలి. అలాగే ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి. వర్షపునీరు, ఇంట్లో వదిలేసిన నీరు ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి ఇంకి బోర్లలో నీటి ఊటలు పెరుగుతాయి. ఇంకుడు గుంత ఉంటే నీటిని నిల్వ చేసుకున్నట్లే..

– సతీశ్ యాదవ్, జిల్లా భూగర్భజల శాఖ అధికారి

ఎందుకీ పరిస్థితి...

జిల్లా కేంద్రానికి ఎగువన ఒకవైపు కామారెడ్డి పెద్ద చెరువు, మరోవైపు అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు ఉన్నాయి. ఈ రెండు చెరువులతో భూగర్భ జలాలకు ఢోకా ఉండేది కాదు. దీనికి తోడు మూడు, నాలుగు దశాబ్దాల క్రితం పట్టణంలో ఎన్నో కుంటలు, నాళాలు ఉండేవి. రుక్మిణీకుంట, బతుకమ్మ కుంట, పీతిరికుంట, తెట్టికుంట.. ఇలా ఎన్నో కుంటల పేర్లు మాత్రమే మిగిలాయి. ఆ కుంటలన్నింటిని ఆక్రమించి పెద్దపెద్ద బంగళాలు కట్టారు. అలాగే చాలాచోట్ల నాళాలు ఆక్రమణలకు గురయ్యాయి. పెద్దపెద్ద నాళాల స్థానంలో భవనాలు కట్టేశారు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు వర్షపు నీరంతా రోడ్లపై నిండిపోయి చెరవులను తలపిస్తాయి. చాలా ప్రాంతాల్లో వరద ఇళ్లల్లోకి చేరుతుంది. దీనికి కారణం నాళాలు ఆక్రమణలకు గురవడమే. అప్పట్లో నాళాల ద్వారా వర్షపు నీరు పారడం వల్ల చాలా నీరు భూమి పొరల్లోకి ఇంకేది. ఇప్పుడు ఆ నాళాలు లేవు. నీరు ఇంకేపరిస్థితీ లేదు. దీనికి తోడు వీధులన్నింటిని సీసీ రోడ్లతో నింపేస్తున్నారు. ఎక్కడా జాగా ఖాళీగా ఉండకుండా సీసీ రోడ్లు వేస్తున్నారు. దీంతో రోడ్లపై పడిన వర్షపు నీరు ఇంకే దారి ఉండడం లేదు. డ్రెయినేజీల ద్వారా వెళ్లిపోతుండడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందడం లేదు. దీంతో ఏటా వేసవి సీజన్ వచ్చిందంటే చాలు బోర్లన్నీ ఎత్తిపోయి తాగునీటి సమస్య తలెత్తుతోంది.

'ఇంకుడు' సంగతి పట్టించుకునేవారేరి?

ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే సందర్భంలో నిర్మాణ స్థలాన్ని బట్టి ఇంకుడు గుంత ఎంత తవ్వాలన్న దానికి మున్సిపాలిటీకి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో ఇంటికి కనీసంగా రూ. 2 వేల నుంచి రూ. 5 వేల దాకా వసూలు చేస్తారు. అయితే ఇంటికి పర్మిషన్ ఇచ్చిన తర్వాత ఇంకుడు గుంతల సంగతిని అధికారులు పట్టించుకోరు. ఇల్లు కట్టుకుంటున్న వారూ ఆసక్తి చూపరు. బోరుకు సమీపంలో ఇంకుడు గుంత నిర్మించి రెయిన్ వాటర్ గానీ, ఇంట్లో వాడిన నీటిని గానీ గుంతలో ఇంకేట్టు చేస్తే బోర్లు రీచార్జి అవుతాయని తెలిసినా సరే ఎవరూ దీనిపై దృష్టి సారించడం లేదు. దీంతో వేసవి సీజన్ రాకముందే బోర్లలో నీటి ఊటలు తగ్గిపోయి ఎత్తిపోవడం మొదలవుతాయి. దాదాపు మూడు నుంచి నాలుగు నెలల పాటు నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బల్దియా నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని ఇంటికి డ్రమ్ము, రెండు డ్రమ్ములు సరఫరా చేస్తారు. అవి ఏ మూలకూ సరిపోవు. దీంతో సీజన్‌లో ప్రతి ఒక్కరూ నీటిని కొనుగోలు చేయాల్సిందే. కాలాన్ని బట్టి ట్యాంకరుకు రూ.500 నుంచి రూ.వెయ్యి దాకా ఖర్చుచేయాల్సి వస్తోంది. అయినా సరే ఇంకుడు గుంతల గురించి మాత్రం ఆలోచించడం లేదు.

రవాణా శాఖ ఆదాయం అదిరింది



కేక్ కట్ చేస్తున్న డీటీవో శ్రీనివాస్‌రెడ్డి

- ఆర్థిక సంవత్సరంలో రూ. 68.19 కోట్ల ఆదాయం
- రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో జిల్లా రవాణా శాఖ

కామారెడ్డి క్రైం: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఆదాయాన్ని రాబట్టడంలో జిల్లా రవాణా శాఖ అద్భుత పనితీరును ప్రదర్శించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా రవాణా శాఖకు రూ. 68.19 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం రూ. 73 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 92.04 శాతం పూర్తి చేశామని జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించడంలో కృషి చేసిన తమ శాఖ సిబ్బందిని అభినందించారు. బుధవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదాయం ఇలా..

2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ. 63 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ఏటా 16 శాతం లక్ష్యాన్ని పెంచుతుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాకు రూ. 73 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించింది. అన్ని రకాల ట్యాక్సులు, ఫీజుల రూపంలో గతేడాదితో పోలిస్తే ఈసారి రూ. 68.19 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ప్రధానంగా ప్రత్యేక తనిఖీల ద్వారా 9.64 కోట్లు, గ్రీన్ ట్యాక్స్ రూపంలో రూ. 79.83 లక్షలు, సర్వీస్ చార్జీల రూపంలో రూ. 2.17 కోట్లు, ఫీజుల రూపంలో రూ. 7.35 కోట్లు, లైఫ్ ట్యాక్సుల రూపంలో రూ. 38.35 కోట్లు, త్రైమాసిక ట్యాక్స్‌ల రూపంలో రూ. 9.89 కోట్ల ఆదాయం వచ్చింది.

గతేడాదికంటే రూ. 5 కోట్లు అదనంగా..

గతేడాదికంటే ఈసారి రూ. 5.06 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. ప్రత్యేక తనిఖీల ద్వారా రూ. 3.69 కోట్లు, గ్రీన్ ట్యాక్స్ రూపంలో రూ. 6.26 లక్షలు, సర్వీస్ చార్జీలు రూ. 6.92 లక్షలు, ఫీజుల రూపంలో రూ. 25.05 లక్షలు, లైఫ్ ట్యాక్సుల రూపంలో రూ. 71.12 లక్షలు, త్రైమాసిక ట్యాక్స్‌ల రూపంలో రూ. 23.39 లక్షల అదనపు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తూ..



వాహనాలకు సంబంధించిన ట్యాక్సులను సకాలంలో చెల్లించకపోతే ఎలాంటి నష్టాలు ఉంటాయో వాహన దారులకు వివరించడానికి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో కూడా ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతతో పాటు, ఫీజులు, ట్యాక్సుల విసయమై అవగాహన కల్పించాం. దీంతో సత్ఫలితాలు వచ్చాయి. ఆదాయం విషయంలో జిల్లా రవాణా శాఖ ద్వితీయ స్థానంలో ఉన్నందుకు సంతోషంగా ఉంది.

– శ్రీనివాస్‌రెడ్డి, డీటీవో, కామారెడ్డి

వ్యవసాయ అధికారులకు కొత్త ఫోన్‌నంబర్లు

నిజాంసాగర్: జిల్లా వ్యవసాయశాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. జిల్లా వ్యవసాయ అధికారితోపాటు డివిజన్, మండలాల అధికారులకు ప్రభుత్వం కొత్త నంబర్లను కేటాయించింది. ఇకపై పాత ఫోన్ నంబర్లు పనిచేయవు. వ్యవసాయ సలహాలు, సూచనల కోసం కొత్త నంబర్లకే ఫోన్ చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్ల వివరాలు..

పనిచేసే స్థలం	బాధ్యత	ఫోన్‌నంబర్	పనిచేసే స్థలం	బాధ్యత	ఫోన్‌నంబర్
కామారెడ్డి	డీఏవో	89777 46046	లింగంపేట	ఏవో	89777 46298
కామారెడ్డి	ఏడీఏ	89777 46267	నాగిరెడ్డిపేట	ఏవో	89777 46301
ఎల్లారెడ్డి	ఏడీఏ	89777 46296	రామారెడ్డి	ఏవో	89777 46302
బాన్సువాడ	ఏడీఏ	89777 46233	సదాశివనగర్	ఏవో	89777 46303
బిచ్కుంద	ఏడీఏ	89777 46238	తాడ్వాయి	ఏవో	89777 46304
బొప్పాస్‌పల్లి	ఏడీఏ	89777 46306	ఎల్లారెడ్డి	ఏవో	89777 46305
మాల్తుమ్మెద	ఏడీఏ	89777 46324	బాన్సువాడ	ఏవో	89777 46235
మాల్తుమ్మెద	ఏవో	89777 46325	బీర్కూర్	ఏవో	89777 46236
కామారెడ్డి	ఏవో	89777 46283	నస్రుల్లాబాద్	ఏవో	89777 46237
భిక్కనూరు	ఏవో	89777 46268	బిచ్కుంద	ఏవో	89777 46239
బీబీపేట	ఏవో	89777 46269	డోంగ్లీ	ఏవో	89777 46240
దోమకొండ	ఏవో	89777 46270	జుక్కల్	ఏవో	89777 46247
రాజంపేట	ఏవో	89777 46295	మద్నూర్	ఏవో	89777 46248
మాచారెడ్డి	ఏవో	89777 46284	మహమ్మద్‌నగర్	ఏవో	89777 46249
పాల్వంచ	ఏవో	89777 46294	నిజాంసాగర్	ఏవో	89777 46250
గాంధారి	ఏవో	89777 46297	పిట్లం	ఏవో	89777 46251
			పెద్దకొడప్‌గల్	ఏవో	89777 46252

రేషన్‌కార్డులు సరే.. బియ్యం ఏవి?

దోమకొండ: సీతారాంపల్లి గ్రామానికి చెందిన 70 మందికి ప్రభుత్వం మూడు నెలల క్రితం కొత్త రేషన్‌కార్డులను అందజేసింది. కానీ వారికి ఇప్పటి వరకు రేషన్‌బియ్యం పంపిణీ చేయలేదు. దీంతో వారు బుధవారం దోమకొండలోని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి, తహసీల్దార్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. బియ్యం వచ్చేలా చూడాలని తహసీల్దార్ సంజయ్‌రావ్‌కు వినతిపత్రం ఇచ్చారు.



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

నిరంతరం ప్రజల్లోనే ఉండండి



మాజీ సీఎం కేసీఆర్‌తో ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు ముజీబొద్దీన్, గంప గోవర్ధన్, జీవన్‌రెడ్డి, ఆయేషా ఫాతిమా, ప్రశాంత్‌రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, జాజాల సురేందర్, హన్మంత్ సింధే

- బీఆర్‌ఎస్ నేతలకు దిశానిర్దేశం చేసిన కేసీఆర్
- పార్టీ రజతోత్సవాలపై ఉమ్మడి జిల్లా నేతలతో సమీక్ష

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 'రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైంది. మీరంతా ప్రజల్లోనే ఉండండి. భవిష్యత్తు మనదే' అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్‌ఎస్ నేతలకు సూచించారు. బుధవారం ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నియోజక వర్గాల ఇన్‌చార్జీలు, పార్టీ జిల్లా అధ్యక్షులతో బీఆర్‌ఎస్ రజతోత్సవాల గురించి సమీక్షించారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే సభను విజయవంతం చేయడానికి చేయాల్సిన ఏర్పాట్ల గురించి వారికి వివరించారు. సమావేశం వివరాలను బీఆర్‌ఎస్ నేతలు వెల్లడించారు. తెలంగాణపై మనకున్న అవగాహన మరెవరికీ ఉండదని, ప్రజలకు మేలు చేయాలన్న ఆర్తి మనకే ఉంటుందన్న విషయాన్ని కేసీఆర్ నొక్కి చెప్పారని జిల్లా నేతలు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల్లోనే ఉండాలని సూచించాన్నారు. కేసీఆర్‌తో సమావేశమైన వారిలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే, జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, పార్టీ నాయకురాలు ఆయేషా ఫాతిమా తదితరులున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం డిస్ట్రిక్ట్ లెవల్ సాండ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని 1, 2, 3 ఆర్డర్ కాలువలలో ఇసుక లభ్యతపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక లభ్యత ఉన్నచోట్ల నుంచి అక్కడి తహసీల్దార్లు నీటిపారుదల శాఖ అధికారులను సమన్వయం చేసుకుని స్థానిక అవసరాలకు ఇసుక సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న ఇసుక క్వారీల వద్ద రెవెన్యూ సిబ్బందికి సహకారంగా ఉండేందుకు తగిన పోలీస్ సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు సూచించారు. మట్టి అక్రమ తవ్వకాలను నిరోధించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, అధికారులు పాల్గొన్నారు.



సాండ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

రేషన్ షాప్ తనిఖీ

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని 14 వ నంబరు రేషన్ దుకాణాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం తనిఖీ చేశారు. సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం దుకాణంలో బియ్యం తూకం వేస్తున్న తీరును, బియ్యం నాణ్యతను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సన్నబియ్యం పంపిణీపై అభిప్రాయం తెలుసుకున్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ అధికారులతో అన్ని రేషన్ దుకాణాలను తనిఖీ చేయిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సన్నబియ్యం పంపిణీపై లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఘనంగా నిర్వహించాలి

బాబూ జగ్జీవన్ రాం, అంబేద్కర్ జయంతులను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జయంతి ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

సబ్సిడీ మంజూరు చేస్తూ తీర్మానం

కామారెడ్డి క్రైం: జిల్లా పరిశ్రమల శాఖకు సంబంధించిన వివిధ పథకాలకు రూ.51.10 లక్షల సబ్సిడీని మంజూరు చేస్తూ డీఐపీసీ తీర్మానం చేసింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో డీఐపీసీ(డిస్ట్రిక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ) సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల యూనిట్‌ల ఏర్పాటు కోసం ఆన్‌లైన్ ద్వారా ఇప్పటివరకు 1,385 దరఖాస్తులు రాగా వాటిలో 189 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామని కలెక్టర్ పేర్కొన్నారు. 17 యూనిట్‌లకు సంబంధించిన రూ. 51.10 లక్షల సబ్సిడీని మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమవేశంలో పరిశ్రమల శాఖ జీఎం లాలూ నాయక్, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డీఐపీసీ సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్లుప్తంగా

జడ్జిని నియమించండి



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టులో జడ్జిని నియమించాలని కోరుతూ బుధవారం బిచ్కుంద బార్ అసోసియేషన్ నాయకులు.. తెలంగాణ హైకోర్టులో కామారెడ్డి పోర్టు ఫోలియో చూసే జడ్జి పుల్లా కార్తీక్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం బార్ అధ్యక్షుడు ప్రకాష్ పటేల్ మాట్లాడుతూ.. బిచ్కుంద కోర్టులో మూడేళ్ల క్రితం బదిలీపై వెళ్లిన న్యాయమూర్తి స్థానంలో కొత్తగా న్యాయమూర్తిని నియమించలేదని, కక్షిదారులు, న్యాయవాదులు చాలా అవస్థలు పడాల్సి వస్తుందని విన్నవించినట్లు తెలిపారు. త్వరలో శాశ్వత న్యాయమూర్తిని నియమించాలని జస్టిస్ పుల్లా కార్తీక్‌ను కోరినట్లు తెలిపారు. న్యాయవాదులు లక్ష్మణ్‌రావు, మల్లేశ్వర్, శివాజీ, విఠల్, విఠల్ రావు, షేక్ మహ్మద్, శంకర్‌రావు, రాజ్ దేశ్ ముఖ్, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేతకు సన్మానం



కామారెడ్డి క్రైం/కామారెడ్డిఅర్బన్: జిల్లా బీసీ సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొండపల్లి గాయత్రి ఇటీవల వెలువడిన టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో జిల్లా స్థాయిలో ఉద్యోగం సాధించి సత్తా చాటింది. బుధవారం ఆమెను కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్‌లు విక్టర్, చందర్ నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, అధికారులు ఘనంగా సన్మానించారు. డీఈవో రాజు, పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబీర్ మనోహర్‌రావు, జె.లక్ష్మీరాజ్యంలు కూడా ప్రత్యేకంగా ఆమెను అభినందించారు.

మహనీయుడు సర్వాయి పాపన్న



కామారెడ్డి క్రైం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాటం చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కామారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ విక్టర్, జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, గౌడ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి భారత పౌరులు

ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులు భావి భారత పౌరులని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో నిర్వహించిన ఇన్‌ఫాన్షియా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో సీఎంఐ సంస్థ ద్వారా జీవదాన్ పాఠశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి విద్యను అందించడం సంతోషకరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీఐఎం ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ అలెక్స్, కౌన్సిల్ సభ్యులు థామస్, ప్రిన్సిపల్ బాబు, ఏఎంసీ చైర్ పర్సన్ రజిత, తదితరులున్నారు.

సర్టిఫికెట్ల జారీకి ఆన్‌లైన్ కష్టాలు

- పనిచేయని మున్సిపల్ వెబ్‌సైట్
- పెండింగ్‌లో 600లకుపైగా జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లు
- పది రోజులుగా ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు



మున్సిపల్ వెబ్‌సైట్‌లో చూపుతున్న ఎర్రర్

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌కు సంబంధించి ధ్రువ పత్రాలు జారీ చేసే వెబ్‌సైట్ సాంకేతికపరమైన లోపాలతో ఓపెన్ కావడం లేదు. దీంతో ఆయా సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. బల్దియా కార్యాలయం చుట్టూ దరఖాస్తుదారులు నిత్యం చక్కర్లు కొడుతున్నారు. 10 రోజులుగా ఎదురవుతున్న ఈ సమస్యతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. వెబ్‌సైట్ లాగిన్ చేయగానే ఎర్రర్ అని చూపుతోంది. సుమారు 600లకు పైగా ధ్రువపత్రాలు బల్దియా లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. నిత్యం దరఖాస్తుదారులు వారి సర్టిఫికెట్ల కోసం మున్సిపల్ అధికారులను, సిబ్బందిని నిలదీస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ రాజేందర్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉందని ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ఎస్‌ఆర్‌ఎన్‌కే కళాశాలలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు, అధ్యాపకులు



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

బాన్సువాడ రూరల్: విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల స్వామి అన్నారు. బుధవారం కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు పోకుండా ఉన్నత లక్ష్యాల వైపు అడుగు వేయాలని సూచించారు.

కామారెడ్డి అర్బన్: యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో నార్కోటిక్స్ డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమన్వయ కర్తలు విశ్వప్రసాద్, అంకం జయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బస్‌పాసుల రెన్యువల్‌కు కష్టాలు !

- ప్రింటర్లు సరిగా పనిచేయవు
- ఒక్కొక్కరి నుంచి రూ.50 వసూలు
- లామినేషన్ చేసి ఇవ్వరు...



కామారెడ్డి బస్టాండ్‌లో బస్ పాస్‌ల జారీ కేంద్రం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కామారెడ్డి ఆర్టీసీ డిపో అధికారుల తీరే వేరు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఇదే సమయంలో బస్‌పాసుల జారీ విషయంలోనూ అదే నిర్లక్ష్యం కనపడుతోంది. ఆర్టీసీ బస్సుల్లో వివిధ రాయితీలపై ప్రయాణించే వారికి ఇచ్చే బస్‌పాసుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బస్‌పాసుల జారీ కేంద్రంలో ప్రింటర్లు సరిగా పనిచేయవు. బస్‌పాసును లామినేషన్ చేసి ఇవ్వాల్సి ఉండగా, మిషన్ మూలన పడిందని తప్పించుకుంటున్నారు. ప్రింటింగ్, లామినేషన్ కోసమే ఒక్కొక్కరి నుంచి రూ.50 వసూలు చేస్తారు. కానీ లామినేషన్ చేసి ఇవ్వడం లేదు. విద్యార్థులు, జర్నలిస్టులకు సంబంధించి బస్‌పాసులను లామినేషన్ చేసి ఇవ్వకుండా బయట చేయించుకోమని చెబుతున్నారు. కొందరు ఇదేమని ప్రశ్నిస్తే మిషన్ లేదని అంటున్నారు. డబ్బులు తీసుకుంటున్నపుడు చేసి ఇవ్వాలి కదా అంటే నోరు మెదపడం లేదు.

'జన్యుపరమైన కారణాలతోనే ఆటిజం'



ఆటిజం అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

కామారెడ్డి టౌన్: జన్యుపరమైన కారణాలతో ఆటిజం వ్యాధి వస్తుందని ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో వైద్యులు బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ హాల్ నుంచి ప్లకార్డులతో నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ..మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు.. అందులో స్రవించే సెరోటోనిన్, డోపమిన్‌వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోవడం, నెలలు నిండకుండా శిశువు పుడితే కూడా ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ ఉంటాయని వివరించారు.

చలివేంద్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డీపీవో కె.మురళి

నిజాంసాగర్(జుక్కల్): ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, ప్రధాన చౌరస్తాల్లో చలివేంద్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) కె.మురళి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశంలో డీపీవో మాట్లాడారు. మూగజీవాలకు సైతం తాగునీరు అందుబాటులో ఉండేలా పశువుల నీటి తొట్టెలను నీటితో నింపాలన్నారు. ఎంపీడీవోలు గంగాధర్, అనిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూకబ్జాలను అడ్డుకోవాలి

రాజంపేట: ప్రభుత్వ భూముల ఆక్రమణ, కబ్జాలను అడ్డుకోవాలని కోరుతూ బుధవారం రాజంపేట మండల కేంద్రంలో కొప్పుల నరేష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో సర్వే నెంబరు-576, 566, 567, 569లలోని ప్రభుత్వ భూముల్లో కబ్జాలకు గురైన భూములపై అధికారులు సమగ్ర సర్వే చేసి గ్రామంలోని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామంలో వేంకటేశ్వర, రాజరాజేశ్వర, సంగమేశ్వర ఆలయ భూములను సైతం కాపాడాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత కీలక పాత్ర

నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత కీలక పాత్ర పోషించాలని నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ అన్నారు. బుధవారం మండలంలోని అచ్చంపేట గెస్ట్ హౌస్ ఆవరణలో జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమృత సుద్దు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జుక్కల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామసభలను విజయవంతం చేయాలి

మద్నూర్(జుక్కల్): రాజ్యాంగ పరిరక్షణ కోసం గురువారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే పాదయాత్రలను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు అన్నారు. మండల కేంద్రంలోని పెద్ద శక్కర్గ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నేడు సదాశివనగర్‌కు తరలిరావాలి

సదాశివనగర్/తాడ్వాయి(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండల కేంద్రంలో నేడు జరిగే మహనీయులు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలి రావాలని కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ కార్యలయం వద్ద ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రీతం ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

ఘనంగా ఈఎంటీ దినోత్సవం

కామారెడ్డి టౌన్: 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్(ఈఎంటీ) దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ఈఎంటీలు కేక్ కట్ చేసి ఒకరికొకరు పంచుకున్నారు. 108 అంబులెన్స్ మేనేజర్ తిరుపతి, ఈఎంటీ పైలట్‌లు కృష్ణస్వామి, శంకర్, రాజేందర్, సురేష్, విజయ్‌కుమార్, బాలనర్సింలు, కార్తిక్, రాజయ్య తదితరులున్నారు.

అక్రమంగా పట్టా చేశారని ఆందోళన



సదాశివనగర్ తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మోడెగాం గ్రామస్తులు

- బాధితులకు అండగా తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించిన మోడెగాం గ్రామస్తులు
- తహసీల్దార్ నిలదీత

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తమకు తెలియకుండా అక్రమంగా పట్టా ఎలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం మోడెగాంకు చెందిన రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామంలోని జౌడి రాధవ్వకు జ్యోతి, స్వప్న, నవిత అనే ముగ్గురు కుమార్తెలున్నారు. నవితను గంగారెడ్డితో పెళ్లి చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా నవిత మాట్లాడుతూ.. మోడెగాం శివారులోని సర్వేనంబర్ 159/2/1/1లో 2 ఎకరాల 14 గుంట భూమిని చెల్లెలు అయిన స్వప్న భర్త పాటిమీది కరుణాకర్‌రెడ్డికి మార్చి 2025, 11న సేల్ డీడ్ చేసి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఒరిజినల్ పట్టా పాస్ పుస్తకం మా సంఘంలో ఉండగా మాకు తెలియకుండా సేల్ డీడ్ ఎలా చేస్తారని తహసీల్దార్‌ను నిలదీశారు. కుటుంబ సభ్యులు అనుమతి లేకుండా ఆ భూమిపై క్రాప్ లోన్ ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ ఎలా చేసి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాధవ్వ పేరు మీద ఉన్న ఆ భూమి కేవలం ఇల్లరికం పెట్టుకున్న నవిత-గంగారెడ్డిలకు మాత్రమే చెందాలే తప్ప ఆ భూమిపై ఎవరికి హక్కు లేదన్నారు. తహసీల్దార్ డబ్బులకు కక్కుర్తి పడి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.గ్రామ రెడ్డి సంఘం సభ్యులున్నారు.

హెచ్‌సీయూ భూములను కాపాడాలి

కామారెడ్డి టౌన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) భూములను కాపాడాలని భారతీయ విద్యార్థి మోర్చా (బీవీఎం) ఆధ్వర్యంలో నేడు(గురువారం) చలో సెక్రటేరియట్ కార్యక్రమం చేపడుతున్నట్లు రాష్ట్ర కార్యదర్శి విఠల్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు అర్బాస్‌ఖాన్, నాయకులు బుల్లెట్ కృష్ణ, అశోక్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

బాన్సువాడ : హెచ్‌సీయూ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం డీవో సువర్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు గణేష్ మాట్లాడుతూ..ఆక్రమణలకు గురవుతున్న భూమిని యూనివర్సిటీ అధీనంలోకి తీసుకోవాలని అన్నారు. సేవ్ హెచ్‌సీయూ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నేతలు శివసూరి, గాండ్ల కృష్ణ, అనీల్, జీవన్, తదితరులుఉన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు

బిచ్కుంద(జుక్కల్): బీజేపీ ఆధ్వర్యంలో చలో హెచ్‌సీయూ కార్యక్రమం తలపెట్టడంతో బుధవారం బిచ్కుందలో పోలీసులు ముందస్తుగా బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ..హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అలరించిన కుస్తీ పోటీలు



మత్తడి పోచమ్మ ఆలయం వద్ద కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వద్ద బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. కొబ్బరికాయ కుస్తీ నుంచి మూడు తులాల వెండి కడెం వరకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మల్లయోధులకు నగదు బహుమతులు అందజేశారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ మహిళ మగవారితో సమానంగా కుస్తీ పోటీల్లో పాల్గొని గెలుపొందడం విశేషం.

కోనాపూర్‌లో..

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో బుధవారం ఉగాది ఉత్సవాల్లో భాగంగా కుస్తీపోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీపోటీల్లో తలపడ్డారు. విజేతలకు వీడీసీ సభ్యులు నగదు బహుమతులతోపాటు వెండి కడియాలు బహూకరించారు. పెద్ద సంఖ్యలో కుస్తీ పోటీలను తిలకించడానికి ప్రజలు వచ్చారు.



కోనాపూర్‌లో కుస్తీపడుతున్న మల్లయోధులు

అనారోగ్యంతో మహిళా మోర్చా అధ్యక్షురాలి మృతి



సన్నిధి అలియాస్ అష్షని (ఫైల్)

బీబీపేట: మల్కాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా మండలాధ్యక్షురాలు సన్నిధి అలియాస్ అష్షని (25) బుధవారం మృతి చెందారు. ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా, చికిత్స పొందుతూ తెల్లవారుజామున మరణించారు. మృతురాలికి భర్త స్వామిగౌడ్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆమె అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని సంతాపం తెలిపారు.

గుడి గంట చోరీ

భిక్కనూరు: బస్వాపూర్‌లో పెద్దమ్మ ఆలయం వద్ద ఉన్న ఇత్తడి గంట చోరీకి గురైందని భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. గంటను చోరీ చేసిన యువకుడి చిత్రం సీసీ ఫుటేజీల్లో రికార్డయ్యిందని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడుకుడ గ్రామంలో గత నెల 22న జరిగిన హత్య కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ రూరల్ సీఐ కే శ్రీధర్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన బాలాజీ కొన్నేళ్లుగా పచ్చలనడుకుడలో నివాసముంటూ కూలి పని చేసుకొని జీవిస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన అతని స్నేహితుడు శంకర్ సైతం అతని వద్దకే వచ్చి కూలి పని చేసుకుంటున్నాడు. వ్యక్తిగత విషయాల్లో ఇరువురి మధ్య బేధాభిప్రాయాలు రావడంతో మద్యం సేవించి గొడవపడ్డారు. శంకర్‌పై కోపం పెంచుకున్న బాలాజీ అతనిపై తీవ్రంగా దాడి చేసి కొట్టడంతో చనిపోయాడు. దీంతో బాలాజీ వెంటనే మహారాష్ట్రకు పారిపోయాడు. నిందితుడు తిరిగి వేల్పూర్ నుంచి పచ్చలనడుకుడకు వెళ్లే క్రమంలో గుర్తించి పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. బాలాజీపై ఇదివరకే మహారాష్ట్రలో మర్డర్ కేసు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. సీఐ వెంట వేల్పూర్ ఎస్సై సంజీవ్ ఉన్నారు.

న్యూసెన్స్ కేసు నమోదు



ఎల్లారెడ్డి: రోడ్డుపై న్యూసెన్స్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై మహేశ్ హెచ్చరించారు. మంగళవారం రాత్రి బర్త్‌డే పార్టీ పేరిట రోడ్డుపై కేక్ కట్ చేస్తూ న్యూసెన్స్ క్రియేట్ చేయడంతోపాటు బీరు సీసాలు కలిగి ఉన్న యువకులపై కేసు నమోదు చేశామన్నారు. యువకులతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

అల్ప్రాజోలం కేసులో మరో నిందితుడి అరెస్టు

కామారెడ్డి క్రైం: నిషేధిత అల్ప్రాజోలం మత్తు మందు రవాణా, విక్రయం కేసులో మూడు రోజుల క్రితం మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పరారీలో ఉన్న మద్నూర్‌కు చెందిన మరో నిందితుడు, ఓ ప్రముఖ దినపత్రికలో పనిచేస్తున్న విలేకరి పయ్యర్ల శ్రీనివాస్‌గౌడ్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన క్రిష్టా అనే వ్యక్తి వద్ద నుంచి అల్ప్రాజోలంను కొనుగోలు చేసి మద్నూర్‌లోని అతని కల్లు దుకాణంలో ఉపయోగించే వాడని వెల్లడించారు. ఎవరైనా మత్తుపదార్థాలను కలిగి ఉన్నా, సరఫరా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తండ్రి ఆత్మహత్యాయత్నం

- బాసర గోదావరి వద్ద కాపాడిన పోలీసు కానిస్టేబుల్

బాసర: గోదావరి నదిలో పిల్లలతో కలిసి దూకేందుకు యత్నించిన వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా కేంద్రం బోయగల్లికి చెందిన కోమటి గంగప్రసాద్, భార్య లక్ష్మి నిజామాబాద్‌లోని బట్టల దుకాణంలో పని చేస్తుంటారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు వర్షిణి, రషిత ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు పిల్లలను తీసుకుని వచ్చిన గంగప్రసాద్ బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి హుటాహుటిన వారి వద్దకు చేరుకున్నాడు. గంగప్రసాద్‌ను, అతడి ఇద్దరు పిల్లలను దగ్గరికి తీసుకొని ఓదార్చాడు. గంగప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను ఎస్సై గణేశ్, ఇతర సిబ్బంది అభినందించారు.

బాలుడు అదృశ్యం



సాహిల్‌ఖాన్

బోధన్ టౌన్ (బోధన్) : బోధన్ పట్టణంలో బాలుడు అదృశ్యమైనట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. పట్టణానికి చెందిన షర్ఫుద్దీన్ కుమారుడు సాహిల్ ఖాన్(12) మంగళవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి సైకిల్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 87126 59870, 97081 45311 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

నిజామాబాద్ రూరల్: వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు చేపట్టిన ర్యాలీకి అనుమతి లేకపోవడంతో బుధవారం రాత్రి పోలీసులు అడ్డుకున్నారు. నగరంలోని నాగారం 80 క్వార్టర్స్‌లోని నందిగుట్ట శివాలయం మంత్ర విగ్రహ, నందిగుట్ట శివాలయ నర్మదా బాణలింగ పార్వతి మాత శిఖర ప్రతిష్ఠాపనోత్సవాలు ఈ నెల 1న ప్రారంభమయ్యాయి.

ఉత్సవాల్లో భాగంగా గాజుల్‌పేట్ గురుద్వార్ నుంచి వీరభద్ర స్వామి గుడి వరకు ర్యాలీ నిర్వహించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న మూడు, రెండో టౌన్ ఎస్సైలు హరిబాబు, హన్మాండ్లు అక్కడికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

నగరంలో కత్తిపోట్ల కలకలం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ రోడ్డులోని నిజాంసాగర్ కెనాల్ కట్ట ప్రాంతానికి చెందిన షేక్ గౌస్‌పై ముగ్గురు యువకులు బుధవారం సాయంత్రం కత్తులతో దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడ్డ షేక్ గౌస్‌ను జీజీహెచ్‌కు తరలించారు. పాతకక్షల నేపథ్యంలోనే గౌస్‌పై యువకులు దాడికి పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కత్తితో బెదిరించిన యువకుడి అరెస్టు..



నిందితుడు అల్తాఫ్

ఖలీల్‌వాడి: డబ్బుల కోసం కత్తితో బెదిరించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. నగరంలోని అహ్మద్‌పురా కాలనీకి చెందిన షేక్ అల్తాఫ్ గత నెల 31న బోధన్ రోడ్‌లోని దుర్గా వైన్స్ వద్ద సతీశ్ రెడ్డి, కోలం నాగరాజును కత్తితో బెదిరించి డబ్బులు డిమాండ్ చేశాడు. వైన్స్ యజమాని పసునూరి విశ్వాక్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అల్తాఫ్‌పై గతంలో మహారాష్ట్రలోని ముఖేడ్ పోలీస్ స్టేషన్‌లో హత్యానేరం కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి..



నిందితుడు ఖలీం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. గత నెల 31న రాత్రి 11:30 గంటలకు పాటిగల్లీకి చెందిన మహమ్మద్ ఖలీమ్ అదే కాలనీకి చెందిన అబ్బాస్ అలీ బేగ్‌ను గాయపరిచాడన్నారు. అబ్బాస్ అలీ బేగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.